క్లుప్తంగా

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



నర్సంపేట రూరల్ : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీసీహెచ్ఎస్ రాంమూర్తి అన్నారు. పట్టణంలోని టీహబ్‌ను బు. దవారం ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలోని టీహబ్‌కు వచ్చే రోగులకు త్వరితగతిన ల్యాబ్ రిపోర్టులు, ఎక్స్‌రేలు అందించాలన్నారు. సకాలంలో రోగులకు ఆన్‌లైన్ చేసి వారి రిపోర్ట్స్ అందించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సంపేట ఆస్పత్రి (టీవీవీపీ) సూపరింటెండెంట్ నర్సింహస్వామి, ఆర్ఎంఓ విరిన్, టీ హబ్ మెడికల్ ఆఫీసర్ లత, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

పర్వతగిరి : తెలంగాణలోని అన్ని గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం చివరి తేది ఫిబ్రవరి 1 వరకు ఉందని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పి.అపర్ణ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 5, 6, 7, 8, 9 తరగతిలో ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను సంప్రదించాలని సూచించారు.

బీసీ మహాగర్జనకు 'మెపా' మద్దతు

చెన్నారావుపేట : బీసీ మహాగర్జనకు మెపా మద్దతు ఇస్తున్నట్లు మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తరాలుగా కొన్ని సామాజిక వర్గాల చేతిలోనే అధికార పగ్గాలు ఉంటడం చేత వెనుకబడిన బీసీలంతా ఏకమయ్యే సమయం ఆసన్నమైందన్నారు. ఫిబ్రవరి 2న సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో బీసీ మహాగర్జన నిర్వహించడం జరుగుతుందన్నారు.

కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్



చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి పశువైద్యశాలలో రేబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించారు. మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ, ఎంపీడీఓ శ్రీవాణి, డాక్టర్ రాధిక, మంజీలాల్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్‌ను తప్పకుండా వేయించాలని సూచించారు. ఉప్పరపల్లి హైస్కూల్ హెచ్ఎం జయ, కార్యదర్శి కృష్ణంరాజు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకోవాలి

రాయపర్తి : ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకొని పశుసంపదను కాపాడుకోవాలని వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య అన్నారు. బుధవారం మండలంలోని మహబూబ్‌నగర్‌లో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. పశువైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐనవోలు మండలంతో పాటు రాయపర్తి మండలంలో పశువైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు పుల్లూరు దామోదర్,ఎండీ ఖాజామియా, సభ్యులు శ్రీను, నానునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నల్లబెల్లి : మండలంలోని రేలకుంట–2 అంగన్‌వాడీ టీచర్ నిర్మల మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియలకు బుధవారం రూ.20వేల చెక్కును సీడీపీఓ మధురిమ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆమె వెంట యూడీసీ రెహమాన్, సూపర్‌వైజర్లు అరుణ, ఝాన్సీరాణి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, అంగన్‌వాడీ టీచర్స్, ఉన్నారు.

గీసుకొండ : గ్రేటర్ వరంగల్‌లోని 16వ డివిజన్ ధర్మారంలో చాగంటి భద్రయ్య షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం కావడంతో బాధితులకు బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాద్ బుధవారం రూ. 3 వేల సహాయం అందించారు. అలాగే వీరమల్ల లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాంబాబు, డివిజన్ అధ్యక్షురాలు ప్రసన్న రాంప్రసాద్, ఉన్నారు.

రాయపర్తి: మండలంలోని మైలారంలో ఇటీవల మృతి చెందిన సంగ అనసూర్య, మహబూబ్‌నగర్‌లో మృతి చెందిన ఆశిరెడ్డి వెంకటమ్మ కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ బుధవారం బియ్యం, ఆయిల్ క్యాన్‌లను అందించారు.

కలిసొచ్చిన బంపరాఫర్

- కొనాయమాకులలో ఒకే రోజు చేకూరిన పథకాల లబ్ధి
- ఫలించిన అధికారులు, సిబ్బంది కృషి
- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

గీసుకొండ : మండలంలోని కొనాయమాకుల గ్రామస్తుల సంతోషం అంతా ఇంతా కాదు.. తమకు రేషన్ కార్డులు లేవని, పేదలకు ఇళ్లు లేవని, రైతు భరోసా డబ్బులు పడటం లేదని సతమతం అవుతుండగా ఒకే రోజుతో వారి సమస్యలన్నీ తీరిపోవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఒక్కో మండలం నుంచి ఓ గ్రామాన్ని ఎంపిక చేసి ఈ నెల 26న రిపబ్లిక్‌డే సందర్భంగా ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్తరేషన్ కార్డుల పథకాల అమలుకు శ్రీకారం చుట్టింది. దీంతో తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ కృష్ణవేణితో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, రెవెన్యూ, గ్రామపంచాయతీ సిబ్బంది , వ్యవసాయ శాఖ అధికారులు అర్ధరాత్రి వరకు సర్వే జరిపి అర్హుల జాబితాను తయారు చేశారు. ముఖ్యంగా గ్రామానికి స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న తహసీల్దార్ సంబంధిత శాఖల వారిని సమన్వయపరిచి చేసిన కృషిని అభినందిస్తున్నారు. ఫలితంగా గ్రామంలో అర్హులైన వారందరూ నాలుగు పథకాలకు



కొనాయమాకుల జీపీ భవనం

ఎంపికై లబ్ధి పొందారు. మండలంలోని మిగతా గ్రామాల వారు నాలుగు పథకాల కింద లబ్ధిపొందడానికి కొంత కాలం ఆగాల్సిందే.

అధికారులు, ఉద్యోగుల పనితీరు భేష్.

ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కొనాయమాకులలో నాలుగు పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేసి లబ్ధి చేకూర్చే కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అభినందన, సన్మాన (సక్సెస్ మీట్) కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణవేణి, గీసుకొండ సీఐ మహేందర్, ఎంపీఓ ప్రభాకర్, ఏపీఎం చంద్రకాంత్, కార్యాలయ సూపరింటెండెంట్ కమలాకర్‌లు పాల్గొన్నారు. ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసపత్రాలు పొందిన



గీసుకొండలో సక్సెస్ మీట్‌లో అభివాదం చేస్తున్న అధికారులు, సన్మానం పొందిన ఉద్యోగులు

వారితో పాటు కొనాయమాకుల ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, జీపీ సిబ్బందిని సన్మానించారు.

గ్రామంలో పథకాల లబ్ధిదారుల సమాచారం

జనాభా : 1050
కుటుంబాలు: 367
రేషన్‌కార్డులు ఉన్నవారు : 149
కొత్తగా రేషన్‌కార్డులు వచ్చిన వారు: 64
ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు: 61
ఆత్మీయ భరోసా లబ్ధిదారులు : 28 మంది
రైతు భరోసా లబ్ధిదారులు :1579 మంది

బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

వర్ధన్నపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను ఎన్నుకోవాలని రజక జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలిషాల రాజేశ్ పిలుపునిచ్చారు. కన్వీనర్ బత్తుల సిద్ధేశ్వర పటేల్ ఆధ్వర్యంలో చేపట్టిన బీసీ ఆజాద్ సైకిల్ యాత్ర 11వ రోజు బుధవారం వర్ధన్నపేట పట్టణానికి చేరుకుంది. వారిని సాదరంగా ఆహ్వానించి వర్ధన్నపేట నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌కు బయలుదేరగా రాజేష్ వారికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 2న ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఓరుగల్లు బీసీ రాజకీయ యుద్ధభేరి మహాగర్జన బహిరంగ సభకు పల్లెల నుంచి బీసీ వర్గాలుపెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ సైకిల్‌యాత్రలో నాయకులు చాపర్తి కుమార్ గాడ్గే,



జెండా ఊపి ప్రారంభిస్తున్న రాజేశ్

గాండ్ల రమేష్, ఆరెల్లి నాగార్జున్, మోడెం నరేష్, కుంటి విజయకుమార్, కోట్ల వాసుదేవ్, ఆరెల్లి నాగార్జున, సంతోష్‌కుమార్, రంజిత్, వెంకటేష్, విష్ణువర్ధన్, రవికుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



నర్సంపేట : పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్, అక్షర ద స్కూల్ విద్యార్థులు బుధవారం క్షేత్ర పర్యటనలో భాగంగా కుమ్మరి బట్టిని సందర్శించారు. పట్టణంలోని సర్వాపురంలో కుమ్మరి వారు చేస్తున్న కుండల తయారీలో సృజనాత్మకతను ప్రత్యక్షంగా చూసి అర్థం చేసుకున్నారు. కుండలు తయారు చేసే చక్రం తిప్పుతూ కుండలు తయారు చేయడం నేర్చుకున్నారు. ఈ సందర్భంగా కుమ్మరి గణేష్ మండల తయారీ విధానాన్ని విద్యార్థులకు వివరిస్తూ స్వయంగా చేయించారు. అనంతరం అంగడిసెంటర్‌లోని కమ్మరి కొలిమిని దర్శించి ఇనుప వస్తువులు కత్తి, గొడ్డలి వంటి పనిముట్లు తయారు చేసే విధానాన్ని వీక్షించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్. జ్యోతి, అక్షర ద స్కూల్ ప్రిన్సిపాల్ జి.భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గద్దర్‌పై కపటప్రేమ చూపిస్తున్న కాంగ్రెస్

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 66 అబద్ధాల హామీలతో గద్దెనెక్కి ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతూ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ కృషి చేస్తే దానికి కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డు ఎంపిక చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, పార్లమెంటు కో కన్వీనర్ కట్ల రామచందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్‌లు అన్నారు. పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం కాంగ్రెస్ నాయకులు మంగళవారం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మ దహనాన్ని నిరసిస్తూ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసులు నిరసన కార్యక్రమం వద్దకు చేరుకుని బీజేపీ నాయకులను చెదరగొట్టారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు కూనమల్ల పృథ్వీరాజ్, సీనియర్ నాయకులు రవీందర్‌సింగ్, నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి,



అమరవీరుల స్తూపం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖానాపురం, నెక్కొండల మండల అధ్యక్షులు తనుగుల అంబేడ్కర్, తడుక వినయ్, రాజేందర్, అశోక్, ఆయిని అశోక్, జిల్లా కౌన్సిల్ మెంబర్ రామచందర్, రంజిత్, ప్రతాప్‌రెడ్డి, జిల్లా మహిళా నాయకురాలు సరిత, జిల్లా యువమోర్చా , నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

సంగెం : పుట్టగొడుగుల పెంపకంతో మహిళలు వ్యాపార రంగంలో రాణించి ఆర్థికాభివృద్ధితో పాటుగా మహిళా సాధికారత సాధించవచ్చని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. బుధవారం శాంతి మండల సమాఖ్య కార్యాలయంలో 10 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో 100 రోజుల పని పూర్తి చేసుకున్న వారికి నైపుణ్య అభివృద్ధి చేసి కొత్త జీవనోపాధి ఏర్పాటు చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇంట్లో పుట్టగొడుగుల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కిషన్, ఏపీఓ గణేష్, ఈజీఎంఎం ట్రైనర్ మొగిళి, అర్పెట్టి ట్రైనర్ కిశోర్, బాలస్వామి, సీసీలు పాల్గొన్నారు.

జ్ఞానానికి మించిన ఆయుధం లేదు

- స్వేరో చైర్మన్ ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్

దుగ్గొండి: ప్రపంచంలో జ్ఞానానికి మించిన ఆయుధం లేదని జ్ఞాన సముపార్జన కోసం నిరంతర సాధన చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్వేరో చైర్మన్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన స్వేరో స్టడీ సర్కిల్ రాష్ట్ర కన్వీనర్ మంద శ్యాం తల్లి సుశీల ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం ఆత్మీయ పలకరింపులో భాగంగా సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఆలంభనగా ఉండాలనే స్వేరో సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

సల్లతో 'కడుపు చల్ల' చేపడతాం : పెద్ది

ఆత్మీయ పలకరింపులో భాగంగా స్వేరో సంస్థ చేపట్టిన సల్లతో కడుపు చల్ల కార్యక్రమం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టడం చాలా మంచి కార్యక్రమమని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్, స్వేరో రాష్ట్ర కోకన్వీనర్ పుల్లా కిషన్, చింత సదానందం, సుభద్రశ్యామల, వివిధ మండలాల స్వేరో నాయకులు, బీఆర్ఎస్ మండల నాయకులు సుకినె రాజేశ్వర్‌రావు, కాట్ల భద్రయ్య, శానబోయిన రాజుకుమార్, బొమ్మగాని రవికుమార్, మోహన్‌రావు పాల్గొన్నారు.



సుశీల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, పెద్ది, సుధీర్‌కుమార్

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



దుగ్గొండి : ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లు ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి డిమాండ్ చేశారు. మండలంలోని గిర్నిబావిలో ముదిరాజ్ కులస్తుల మండల స్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని. ఫిబ్రవరి 2న హనుమకొండలో జరగనున్న బీసీ యుద్ధభేరి సభకు ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎన్నారై సెల్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, నీరటి సదానందం, పల్లె రమేశ్, మండల అధ్యక్షుడు ముత్యాల స్వామి, బండారి రాము, జటబోయిన రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, వంద లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకును హిందీ ఉపాధ్యాయురాలు రమాదేవి బుధవారం అందించారు. మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, ఎంపీడీఓ శ్రీవాణి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కోసం, పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు పాటుపడాలి

నెక్కొండ: విద్యార్థులు తమ లక్ష్యం కోసం పాటుపడాలని నెక్కొండ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రంగారావు అన్నారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అప్పల్‌రావుపేట హైస్కూల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు స్వీయ క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు ఆకుల శోభారాణి అందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్స్, పెన్నులను 12 మంది విద్యార్థులకు అందజేశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

రాయపర్తి: పాఠశాలల స్థాయిలో చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపీడీఓ గుగులోతు కిషన్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కాట్రపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పీఈటీ పుట్ట సమ్మయ్య ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించి విజేతులుగా నిలిచి సర్టిఫికెట్లు, మెడల్స్ సాధించగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఈటీ సమ్మయ్యను అభినందించారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

సంగెం : ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర జేఏసీ కో చైర్మన్ మురహర విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఈజీఎస్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు.

పర్వతగిరి : ఉపాధిహామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఏపీఓ, ఈసీ, టీఏ, సీఓల మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇప్పించాలని ఏపీఓ సుశీల్‌కుమార్ కోరారు. బుధవారం ఉపాధి హామీ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీఓ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీడీఓ జీతాలు వచ్చే విధంగా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ రాజు, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ సురేశ్, టెక్నికల్ అసిస్టెంట్లు అన్వేష, ప్రవంతి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు సంఘటితం కావాలి

- అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం

వర్ధన్నపేట: పద్మశాలీలు సంఘటితమై అన్ని రంగాల్లో రాణించాలని, రాష్ట్రంలో 11.5 శాతం ఉన్న పద్మశాలీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ బద్ధమైన పదవులు కేటాయించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం కోరారు. వర్ధన్నపేటలోని భారతీయ నాటక కళాసమితి ఆడిటోరియంలో బుధవారం ఏర్పాటు చేసిన పద్మశాలి సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలీలు రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తానన్నారు. రాష్ట్ర కనీస వేతన సవరణ బోర్డు సభ్యుడిగా బాసాని చంద్ర ప్రకాశ్‌ను నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 2న హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరుగనున్న బీసీ యుద్ధభేరి బహిరంగ సభకు పద్మశాలీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఈగ మల్లేశం

భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. తొలుత వర్ధన్నపేటకు చెందిన పెద్దూరి రాజ్‌కుమార్‌ను పట్టణ అధ్యక్షుడిగా, మండల అధ్యక్షుడిగా పాశికంటి రాంచందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కనీస వేతన బోర్డు చైర్మన్ చంద్రప్రకాశ్, నాయకులు దుస్సా శివకుమార్, బాల్నె శరత్‌బాబు, చంద మల్లయ్య, కందగట్ల నరహరి, మార్త సారంగపాణి, వలువదాసు శ్యాంసుందర్, బిట్ల రవి, గాడిపల్లి రాజేశ్వర్‌రావు, కందగట్ల సంజీవ, సింధం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- దుగ్గొండి సీఐ సాయిరమణ



దుగ్గొండి : అవగాహన కల్పిస్తున్న సీఐ సాయిరమణ

ఖానాపురం : రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని దుగ్గొండి సీఐ సాయిరమణ అన్నారు. మండల కేంద్రం శివారులో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు తప్పకుండా పెట్టుకోవాలన్నారు. ఎస్సై రఘుపతి, ట్రైనీ ఎస్సై హేమలత, పాల్గొన్నారు.

నల్లబెల్లి: ద్విచక్ర వాహనం నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని ఎస్సై గోవర్ధన్ సూచించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుతోనే అసమానతల తొలగింపు

సంగెం : చదువు సమాజంలోని అసమానతలను తొలగించి అన్నిరంగాల్లో ఉన్నతస్థితికి చేర్చుతుందని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ హర్షిత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బేటి బచావో–బేటి పడావో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల లింగ నిష్పత్తి పెంచడం, సమానత్వం పెంపొందించడం ఈ పథకం లక్ష్యమన్నారు. బాలికల సంరక్షణకు ఉన్న చట్టాలు, హెల్ప్‌లైన్ నంబర్ల గురించి వివరించారు.

బేటీబచావో.. బేటీ పడావోపై అవగాహన

దుగ్గొండి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండర్ ప్రతినిధి రమాదేవి మొబైల్,



పోస్టర్లు ప్రదర్శిస్తున్న జెండర్ ప్రతినిధి రమాదేవి, ఉపాధ్యాయులు

సోషల్ మీడియా ప్రభావం, దుష్ప్రభావాలపై వివరించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలల అక్రమ రవాణా, ఆడపిల్లలకు హక్కులను అవగాహన కల్పించారు.హెచ్ఎం ఎలగొండ రామస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

- అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేష్

వర్ధన్నపేట : ప్రజాయుద్ధ నౌక గద్దర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తక్షణమే ప్రజలకు, గద్దర్ కుటుంబానికి క్షమాపణ చెప్పాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేష్, ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాహిత్య కళారూపం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలకంగా ప్రజలను చైతన్యపరుస్తూ పోరాడిన గద్దర్‌పై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. నాయకులు భాస్కర్, చెన్నయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంజర్ల మహేష్

క్రైం కార్నర్

బావిలో దూకిన మహిళ

చెన్నారావుపేట: భూ తగాదా విషయంలో ఓ మహిళ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.ఈర్యతండాకు చెందిన అజ్మీరా రాందాస్, రవి అన్నదమ్ములు. వీరికి కొద్ది రోజులుగా భూమి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. గతంలో అనేకమార్లు దాడులు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఈక్రమంలో బుధవారం చెన్నారావుపేట శివారులోని పాత పోచమ్మగుడి సమీపంలో రవి భూమిని దున్నుతుండగా ఎందుకు దున్నుతున్నావని తన అన్న రాందాస్ భార్య మంగమ్మ అడిగింది. దీంతో నా భూమిని నేను దున్నుకుంటున్న నీకు అవసరం లేదని, ఏమైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకొమ్మని చెప్పాడు. ఫిర్యాదు చేశామని భూమి దున్నడం ఆపాలని చెప్పింది. వినకుండా భూమిని దున్నుతుండటంతో పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యయత్నం చేసింది. స్థానికులు, అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది బావిలో నుంచి మంగమ్మను బయటికి తీశారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

సంగెం : అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన ననుమాస ఆంజనేయులు(64) గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యం మత్తులో నేను చనిపోతానంటూ బెదిరిస్తుండేవాడు. ఈనెల 28న రోజున వ్యవసాయ బావి వద్ద కు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం అయినా ఇంటికి రాకపోవడంతో భార్య పుష్పలీల వెళ్లి చూసేసరికి నోటి నుంచి నురగలు వస్తున్నాయి. 108 వాహనంలో ఎంజీఎంకు తరలించి చికిత్స చేయిస్తుండగా అదే రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

బెల్ట్ షాపుపై దాడులు

నల్లబెల్లి : మండలంలోని రేలకుంటలో బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకుని షాపును సీజ్ చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. జిల్లా ఎక్సైజ్ అధికారి మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేలకుంటలో ఇటీవల కలెక్టర్ సత్యశారద పర్యటనలో పాఠశాల సమీపంలో కిరాణాషాపు ఉండడంతో పాఠశాల సమీపంలో 100 మీటర్ల మేరకు ఏ కిరాణాషాపులు ఉండకూడదని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి మద్యం స్వాధీనం చేసుకొని షాపును సీజ్ చేసి యజమానిని అరెస్టు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట సీఐ నరేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి

నల్లబెల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్ల ద్వారా వేరొక చోటకు వెళ్లి విద్యావ్యవస్థను కుంటుపడే విధంగా ఉపాధ్యాయులు వ్యవహరించడం బాధాకరమని విద్యార్థి సంఘాల నాయకులు బట్టు సాంబయ్య, బొట్ల నరేశ్ అన్నారు. ఎంఈఓ కార్యాలయం ఎదుట బుధవారం ఏబీఎస్ఎఫ్, టీడీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండలంలోని మేడపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న గొల్లపల్లి రామారావుతండా, లక్ష్మితండా, లైన్‌తండా, బజ్జుతండా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు లేకపోవడంతో శనిగరం, బోల్లోనిపల్లికి అనుమతితో వెళ్లారు. డిప్యూటేషన్ ద్వారా పని చేయాల్సిన ఉపాధ్యాయులు ఎలాంటి డిప్యూటేషన్ అనుమతులు లేకుండా ముచ్చింపుల, రేలకుంట పాఠశాలల్లో పనిచేస్తున్నట్లు స్వయంగా ఎంఈఓ చెప్పడం ఆశ్చర్యానికి గురి చేస్తుందన్నారు. డీఈఓ స్పందించి ఎలాంటి డిప్యుటేషన్ అనుమతులు లేకుండా వేరొక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొని బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

రాయపర్తి : మండలంలోని గన్నారం ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 107లో అక్రమంగా సిలువపాతి చర్చిని నిర్మించి ఆక్రమించాలని చూస్తున్నారని ఆరోపిస్తూ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జయపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం గ్రామస్తులు బీజేపీ నాయకులు అబ్బరబోయిన ప్రవీణ్, కుక్కల సాయికిరణ్, గడ్డం వేణు, రాసాల రాజేష్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 15–06–2023న తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా తాత్కాలికంగా నిలిపివేసినట్లు చేసి తిరిగి మళ్లీ డేరా వేసి నడిపిస్తున్నారని తెలిపారు. మేం అక్కడికి వెళ్లి అడిగితే మాకు అధికారుల అనుమతి ఉందని మీరు ఇక్కడికి వస్తే మీపై కేసులు పెడతామని బెదిరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.